క్లుప్తంగా

సూర్య నమస్కారాల పోటీలు



గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

షాద్‌నగర్: రథసప్తమి వేడుకలను పురస్కరించుకొని మండల పరిధిలోని రాయికల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం విద్యార్థులకు సూర్య నమస్కారాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ఉపాధ్యాయులు సూర్యనమస్కారాలు చేయించారు. బాలికల విభాగంలో అక్షర, శ్రావణి, సింధు, సింధూజ, నాగేశ్వరీ, బాలుర విభాగంలో దీపక్, మణికంఠ, చరణ్, రాకేశ్ ఉత్తమ ప్రతిభ కనబరినట్లు పాఠశాల హెచ్‌ఎం జయమ్మ తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 16న రథసప్తమి రోజున బహుమతులు అందజేయనున్నట్లు హెచ్‌ఎం తెలిపారు.

బొడ్రాయి తృతీయ వార్షికోత్సవం



బోనాల ఊరేగింపులో పాల్గొన్న నాయకులు

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ కావలి మల్లేశ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో బొడ్రాయికి తృతీయ వార్షికోత్సవం సందర్భంగా బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరికి దైవభక్తి, దేశభక్తి, పితృభక్తి, సంఘభక్తి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి, నాయకులు రాఘవేందర్‌గుప్తా, సత్యనారాయణగౌడ్, రవి, రాజుగౌడ్, శ్రీరాములు, శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మయ్య, జంగయ్య, శ్రీనివాస్, యాదయ్య, ప్రశాంత్, సురేశ్, నర్సింహులు, గ్రామస్తులు తదితరులున్నారు.

విద్యార్థులకు దాతల ప్రోత్సాహం అవసరం

- హెచ్‌ఎం యాదయ్య



విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న దాత మహేశ్, హెచ్‌ఎం యాదయ్య

షాబాద్: పేద విద్యార్థులకు దాతలు ప్రోత్సాహం అవసరమని నాగర్‌కుంట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం యాదయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని నాగర్‌కుంట ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎం.మహేశ్ 50 మంది విద్యార్థులకు యూనిఫాం, షూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ... విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. గురువులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని తల్లిదండ్రులు కళలను నిజం చేయాలని సూచించారు. మహేశ్ మాట్లాడుతూ...పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానన్నారు. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు.

పదోన్నతులు, బదిలీలు చేపట్టండి

- గురుకుల ఉపాధ్యాయుల జేఏసీ



చిలుకూరు గురుకులంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మొయినాబాద్: ప్రభుత్వ గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలను వెంటనే చేపట్టాలని గురుకుల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. గురుకుల జేఏసీ పిలుపు మేరకు సోమవారం మండల పరిధిలోని చిలుకూరు గురుకులంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. గురుకులాల్లో కొత్త ఉపాధ్యాయుల నియామకం చేపట్టక ముందే ఏళ్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలన్నారు. జీఓ 317 సమస్యను పరిష్కరించకుండా కొత్త నియామకాలు చేపడితే ఏళ్ల నుంచి పనిచేస్తున్న ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే జేఏసీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ చేపడతామన్నారు. నిరసన తెలిపిన వారిలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

కుంట.. కంటతడి!

పరిశ్రమల వ్యర్థాలు చెరువులోకి తరలింపు ● పగుళ్లు ఏర్పడిన కట్ట ● ఆక్రమణలతో తగ్గిన విస్తీర్ణం

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని కాశన్నకుంట చెరువుకు ఏళ్ల నుంచి మరమ్మతులు కరువయ్యాయి. ప్రస్తుతం చెరువు కట్టకు పగుళ్లు రావడంతో పూర్తిస్థాయిలో చెరువు నిండితే కట్ట తెగిపోయే ప్రమాదం ఉంది. దీనికి తోడు చెరువులోకి ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వచ్చేందుకు ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన పాటు కాల్వలు ధ్వంసం కావడంతో భారీ వర్షాలు కురిసిన చెరువులోకి వరద సక్రమంగా రావడం లేదు. కొందరు రియల్టర్లు, పరిశ్రమల నిర్వాహకులు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో కబ్జాలు, ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఏళ్లుగా మరమ్మతులు లేని కారణంగా కంపచెట్లు, పూడికతో నిండుకోవడం వలన చెరువు విస్తీర్ణం, నీటి నిల్వ సామర్థ్యం తగ్గి ఉనికిని కోల్పోతుంది.





కాలుష్య జలాల కారణంగా రంగు మారిన కాశన్నకుంట జలాలు (ఇన్‌సెట్‌లో) ఎఫ్‌టీఎల్ పరిధిలో వేసిన వెంచర్

రంగుమారుతున్న నీరు

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ సమీపంలో సుమారు 32 ఎకరాల్లో కాశన్నకుంట చెరువు విస్తరించి ఉంది. ఈ చెరువు కింద ఒకప్పుడు 30 ఎకరాల అయకట్టు ఉండేది. వర్షాకాలంలో ఈ చెరువు నిండితే వ్యవసాయ బోర్లే కాకుండా గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే బోర్లలోనూ నీటి మట్టం పెరిగేది. తద్వార వేసవిలోనూ నీటి ఇబ్బందులు ఉండేవి కావు. స్థానిక మత్స్యకారులు ప్రతీ ఏడాది లక్షలు వెచ్చించి చేపల పెంపకం చేపడుతున్నారు. కాగా మండల కేంద్రంలో పారిశ్రామిక వాడ ఏర్పాటైన తర్వాత క్రమేణ కొన్ని పరిశ్రమలు కాలుష్య కారకమైన నీటిని వర్షాకాలంలో వరద నీటితో పాటు చెరువులోకి వదిలేశారు. దీంతో ఈ చెరువులోని నీరంతా కలుషితమైంది. దీంతో చెరువులోని నీటిని పశువులు సైతం తాగడం లేదు,

కబ్జాలకు గురవుతున్న వైనం

కాశన్నకుంట చెరువుకు చుట్టూ పరిశ్రమలు, రియల్ వెంచర్లు ఏర్పాటవుతున్నాయి. ఇదే అదునుగా భావిస్తున్న కొందరు అధికారులు, స్థానిక నాయకులకు ముడుపులు చెల్లిస్తూ యథేచ్ఛగా శిఖం పొలాన్ని కబ్జాలు, ఆక్రమిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన ఓ వెంచర్ వర్షాకాలంలో చెరువు నీటితో నిండుకుంటుందంటే అధికారుల పనితీరు ఇట్టే అర్థమవుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

నిబంధనల ప్రకారం... చెరువు ఎఫ్‌టీఎల్ లెవల్ (నీటి పరివాహాక ప్రాంతం) పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. ఇక్కడ ఏర్పాటు చేసిన వెంచర్ చెరువు నీటితోనే నిండుకుంటుంది. ఇక పలువురు వ్యాపారులు యథేచ్ఛగా చెరువు శిఖంను ఆక్రమించారు. ఈ విషయాలను ఎప్పటికప్పుడు ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొచ్చిరా వారు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



కాశన్నకుంట చెరువుకు మిషన్‌కాకతీయ పథకంలో భాగంగా మరమ్మతులు చేపట్టాలి. అప్పుడే కబ్జాలు, ఆక్రమణలు చేసిన వైనం బయటపడుతుంది. గత కొన్నేళ్లుగా మరమ్మతులు లేకపోవడంతో చెరువు మట్టి, కంప చెట్లతో నిండుకుంది.

– యాదగిరి, మత్స్యకార సంఘం సభ్యుడు, కొత్తూరు

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



కాశన్నకుంట చెరువును పరిశీలించి చెరువు పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం. చెరువు శిఖంలో ఏలాంటి కట్టడాలు చేపట్టరాదు. చెరువులోకి కలుషిత నీటిని వదిలినట్లు తేలితే చర్యలు తప్పవు.

– రవీందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ, కొత్తూరు.

ప్రతిఒక్కరూ సైనికుల్లా పని చేయాలి

బీజేపీ నియోజకవర్గ ప్రభారీ రవీందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

షాద్‌నగర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ప్రభారీ, జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి అందె బాబయ్య ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ ప్రవాస్ యోజన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రధాని మోదీ ఎన్నో సంక్షేమ పథకాలను చేపట్టారని వివరించారు. వాటిని ప్రజలకు వివరించి చైతన్యం చేయాలని సూచించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ హ్యాట్రిక్ విజయం సొంతం చేసుకుంటుందన్నారు. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి కార్యకర్త శ్రమించాలని అన్నారు. గతంలో సాధించిన సీట్ల కంటే అధికంగా పార్లమెంట్ సీట్లు సాధించేందుకు పార్టీ అధిష్టానం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతుందని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు వెంకటేష్‌గుప్తా, మహేందర్‌రెడ్డి, నర్సింహ, శ్రీనివాస్, వంశీకృష్ణ, వెంకటేశ్, దొడల వెంకటేశ్, రుషికేశ్, కుర్మయ్య, శ్రీశైలం, మురళీ, మధుసూదన్, నర్సింహాచారి, హరిభూషణ్, శ్రీకాంత్, రఘుగౌడ్, లింగం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’కు ఎనిమిదేళ్లు!

- అర్ధంతరంగా నిలిచిపోయిన పనులు
- అజీజ్‌నగర్‌లో లబ్ధిదారుల ఎంపిక
- నేటికీ పంపిణీ చేయని వైనం



సురంగల్‌లో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణం

మొయినాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని ఆశపెట్టినా.. ఇప్పటికీ పేదలకు అవి అందలేదు. అక్కడక్కడ కొన్ని డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసినా నిర్మాణాలు మాత్రం పూర్తికాలేదు. మండల పరిధిలోని సురంగల్, అజీజ్‌నగర్, కనకమామిడి, చిలుకూరు, చిన్నమంగళారం, తోలుకట్ట తదితర గ్రామాలకు 2016లో అప్పటి ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేసింది. అప్పటి రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి చేతులమీదుగా ఆయా గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ తరువాత రెండేళ్లకు సురంగల్, అజీజ్‌నగర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టారు. కానీ ఇప్పటి వరకు అవి పూర్తి కాలేదు. అజీజ్‌నగర్‌లో 40 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించారు. కానీ డోర్లు, కిటికీలు, విద్యుత్ పనులు పూర్తి చేయలేదు. సురంగల్‌కు 20 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరవ్వగా 16 మాత్రమే నిర్మిస్తున్నారు. మరో నాలుగు డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించలేదు. గతంలో ఇళ్లు ఇచ్చేందుకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేశారు. కానీ నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో ఇంత వరకు పంపిణీ చేయలేదు. మిగిలిన చోట్ల శిలాఫలకాలు వేసి వదిలేశారు తప్పా పనులు మొదలు పెట్టలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిస్థితి అయోమయంగా మారింది. నెల రోజుల క్రితం అజీజ్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు అందజేసేందుకు అధికారులు సన్నాహాలు చేసినా ఇంతవరకు వాటిని ఇవ్వలేదు.

ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం

కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్



భీంభరత్‌ను కలిసిన షాబాద్ సహకార సంఘం వైస్ చైర్మన్ మల్లేశ్

షాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలన్నింటినీ నెరవేరుస్తుందని పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడకు చెందిన బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు, షాబాద్ సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరు మల్లేశ్ భీంభరత్‌ను కలిశారు. త్వరలో తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం మల్లేశ్ విలేకర్లుతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌లో సీనియర్లను గుర్తించడం లేదని కొత్తగా పార్టీలో వచ్చిన వారికే ప్రాధాన్యతనిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదిహేనేళ్లుగా ఎన్నో పోరాటాలు చేశామని, పోలీసులతో దెబ్బలు తిని జైలుకు సైతం వెళ్లినట్లు వివరించారు. అలాంటి తమను పక్కకు పెట్టి కొత్త వారికి ప్రాధాన్యత ఇచ్చి సీనియర్లను విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో గుర్తింపు లేకపోవడంతోనే బీఆర్‌ఎస్‌ను వీడుతున్నామని స్పష్టం చేశారు.

గురుకుల విద్యార్థినికి గోల్డ్ మెడల్



ప్రసన్నవాణితో ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపక బృందం

మొయినాబాద్‌రూరల్: జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్–2024లో చేవెళ్ల గురుకుల పాఠశాల విద్యార్థిని బంగారు పతకం సాధించడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి అన్నారు. సోమవారం పాఠశాల ఆవరణలో కరాటేలో బంగారు పతకం సాధించిన 7వ తరగతి విద్యార్థిని ప్రసన్నవాణిని ఘనంగా సన్మానించారు. పశ్చిమ ప్రాంతీయ సమన్వయాధికారి డాక్టర్ శారదావెంకటేష్, ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు ప్రసన్నను అభినందించారు.

అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం



చేవెళ్ల: మోహన్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎంపీటీసీ, గ్రామస్తులు



మొయినాబాద్ రూరల్: ముర్తుజాగూడ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న రాగమ్మ

- ఎంపీఓ విఠలేశ్వర్‌జీ, ఎంపీటీసీ సభ్యుడు రవీందర్

చేవెళ్ల: గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని.. కొత్తగా ఏర్పడిన మల్లారెడ్డిగూడలో మొదటి సర్పంచ్‌గా మోహన్‌రెడ్డికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని చేవెళ్ల ఎంపీఓ, ప్రత్యేకాధికారి విఠలేశ్వర్‌జీ, ఎంపీటీసీ సభ్యుడు కావలి రవీందర్ అన్నారు. సోమవారం మల్లారెడ్డి గూడలో మాజీ సర్పంచ్ మల్గారి మోహన్‌రెడ్డికి గ్రామస్తులు మధవ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి పెంటారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మల్లారెడ్డిగూడకు మొదటి సర్పంచ్‌గా మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి గ్రామంలో ఎప్పటికి గుర్తుండిపోతుందన్నారు. కొత్తగా ఏర్పాడిన గ్రామ పంచాయతీ అయినప్పటికీ మండలంలోనే అత్యధిక నిధులు తీసుకు వచ్చి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టారని గుర్తు చేశారు. మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామస్తులు, వార్డుసభ్యుల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేశాన్నారు. కొత్త పంచాయతీలో మొదటి సర్పంచ్‌గా అవకాశం కల్పించిన గ్రామస్తులకు రుణపడి ఉంటానని చెప్పారు. పదవులు ఉన్నా.. లేకపోయిన గ్రామాభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడు అందిస్తానని చెప్పారు. ఐదేళ్లలో రూ.1.20కోట్ల నిధులతో డ్రైనేజీ, సీసీరోడ్లు వేయించినట్లు తెలిపారు. అనుబంధ గ్రామమైన ఎర్రోని కోటాల గ్రామంలో కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని మున్ముందు ఎన్నికయ్యే ప్రతినిధులతో పూర్తి చేసుకుందామన్నారు. ప్రత్యేకాధికారి విఠలేశ్వర్‌జీకి సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు శేరి పెంటారెడ్డి, గ్రామస్తులు శంకరయ్య, గ్రామ కార్యదర్శి బాల్‌రాజ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు మహేందర్, మల్లేశ్, గ్రామస్తులు మాధవరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, రాఘు, ప్రవీణ్‌రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తేనే గుర్తింపు

మొయినాబాద్ రూరల్: గ్రామాలను అభివృద్ధి చేసినప్పుడే ప్రజాప్రతినిధులకు గుర్తింపు లభిస్తుందని మండల వ్యవసాయాధికారి, ముర్తుజాగూడ ప్రత్యేకాధికారి రాగమ్మ అన్నారు. సోమవారం ముర్తుజాగూడ పంచాయతీ ఆవరణలో మాజీ సర్పంచ్ మాణమ్మ పంచాయతీ పాలకవర్గాన్ని ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులతో పాటు కోఆప్షన్ సభ్యులను పూలమాలలతో సన్మానించారు. ముందుగా మాణెమ్మను పంచాయతీ ప్రత్యేకాధికారి రాగమ్మ, పంచాయతీ కార్యదర్శి లావణ్య సన్మానించారు. ఉపసర్పంచ్ వసంత, వార్డు సభ్యులు అనురాద, మహేశ్వరి, సరళ, కృష్ణారెడ్డి, గోపాల్, మోసిన్, గణేశ్, కోఆప్షన్ సభ్యులైన రాంచంద్రారెడ్డి, కృష్ణాయాదవ్, మమతలను ఆమె సన్మానించారు. సామ పెంటారెడ్డి, సామ మోహన్‌రెడ్డిలను సర్పంచ్ చేతుల మీదుగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాణమ్మ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధిలో ఐదేళ్ల పాటు పంచాయతీ పాలకవర్గంతో పాటు కోఆప్షన్ సభ్యులు, గ్రామస్తులు సహకరించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దర్శన్‌రెడ్డి, వెంకటేశ్, రమేశ్, పెంటారెడ్డి, మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్



శంకర్‌పల్లి: కమిషనర్ జ్ఞానేశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

శంకర్‌పల్లి: ఈ నెల 16న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ కోరారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై సోమవారం శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జ్ఞానేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదిరిగా రూ.12వేల వేతనం, రూ.10లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. శంకర్‌పల్లి మున్సిపల్ కార్మికులకు వారాంతపు సెలవులు ప్రకటించడంతో పాటు సబ్బులు, నూనెలు అందించాలని కోరారు. కార్మికులు పారిశుధ్య పనులు చేస్తూ ఎన్నో రోగాల బారిన పడి మృత్యువాతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు అమర్‌నాథ్, రాజు, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు సమ్మె

కొత్తూరు: ఈ నెల 16న అఖిలపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన భారత్‌బంద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బీసా సాయిబాబా, టీఎస్‌టీఈయూసీ మండల అధ్యక్షుడు యాదగిరిచారి సోమవారం ఒక ప్రకటనలో కార్మికులను కోరారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిశ్రమల యాజమాన్యాలు, కార్పొరేట్ సంస్థలకు మేలు చేకూరేలా చట్టాలను సవరిస్తుందన్నారు. ప్రస్తుతం అనేక రంగాల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ తదితర సౌకర్యాలు లేవన్నారు. పెరుగుతున్న నిత్యవసరాలతో కార్మికులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. కార్మికుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న భారత్‌బంద్‌లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

‘చలో నల్గొండ’ పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బాలరాజు, జెడ్పీటీసీ అనురాధ

ఆమనగల్లు: రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించడాన్ని నిరసిస్తూ నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభ పోస్టర్లను ఆమనగల్లు పట్టణంలో సోమవారం అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గువ్వల బాలరాజు మాట్లాడుతూ నల్గొండలో జరిగే మాజీ సీఎం కేసీఆర్ బహిరంగ సభకు ప్రజలు భారీగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ, ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, కోనాపూర్ ఎంపీటీసీ సరిత పంతునాయక్, నాయకులు లాలయ్యగౌడ్, శ్రీనునాయక్, రమేశ్, నిరంజన్‌గౌడ్, రమేశ్‌నాయక్, వెంకటేశ్, యాదయ్య, జగన్, గణేశ్, అంజియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములను కాపాడండి

కడ్తాల్: మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ షేక్ ముంతాజ్‌కు, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రాలు అందజేశారు. ఆలయానికి సంబంధించిన సర్వే నంబర్ 120, 130 భూమిలో గుర్తు తెలియని వ్యక్తులు బోర్లు వేసి , కంచెను నిర్మించుకొని ఆక్రమణలకు పాల్పడినట్లు వినతిపత్రంలో వివరించారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, వేణుగోపాల్, నాయకులు భాస్కర్‌రెడ్డి, మోత్యానాయక్, యాదయ్యగౌడ్ ఉన్నారు.